స్కెచ్

# దొంగలూ : దొరలూ

ఆర్. యం. చిదంబరం

ఇన్స్పెక్టర్ రామనాథం కుర్చీలో కూలబడ్డాడు. "అబ్బబ్బ! ఎంత కష్టపడ్డాను! దొంగ పీనుగ ఎన్ని ఎత్తులు వేశాడు! జిత్తులమారి నక్క! కాని వాడి తాత ను నేను. క్షణంలో వాడి నాటకం కట్టేశాను. ఆ సమయానికి సరిగా బుర్ర పనిచేసింది కాని లేకపోతే వాడికోసం యమబాధ పడాలి" అనుకున్నాడు రామనాథం. అతని పెదవుల మీద విజయగర్వముతో కూడుకొన్న చిరునవ్వు వికసించింది.

ఇంతలో కారు హారన్ మోత వినపడింది. మరుక్షణంలో తన యింటిముందు కారొకటి ఆగటం గమనించాడు రామనాథం. ఎవరో చూడటానికి వీధిలోకి అతడు వచ్చేలోగా రఘు వచ్చేశాడు ఎదురుగా. వాడి మొహం వాడిపోయింది.

"ఏరా రఘూ! అలాగున్నావే? ఇవాళ నీ పుట్టిన రోజు కదటరా! సంతోషంగా ఉండటానికి బదులు ఈ విచారమేమిటి? రొప్పుకుంటూ రోజుకుంటూ పరుగెత్తుకొచ్చావే? ఏం జరిగిందేమిటి" అని ప్రశ్నల వర్షం కురిపించాడు రామనాథం.

రఘు కుర్చీలో కూర్చుని "నువ్వు నాకొక సాయం చేయాలి. వారం రోజుల క్రితం వెయ్యి రూపాయలు ఖరీదు చేసే నెక్లేస్ కొన్నాను. అది నీకు చూపించాననుకుంటా. అదెవడో చెక్కేశాడు. ప్రొద్దున ఉందోయ్. ఇప్పుడు మాయమయింది. పోలీసులకు రిపోర్టిచ్చినా లాభంలేదనుకుంటాను. అయినా నువ్వు తెలివైన ఘటానివికనక నీ దగ్గరకు వచ్చాను" అని తన గొడవచెప్పాడు రఘు. రామనాథం టేబిలు మీద చతికిల బడ్డాడు.

"నెక్లేస్ ఎక్కడ దాచావు?"

"మేడమీద బీరువాలో"

"బీరువాకు తాళం వేశావా?"

"వేశాను"

"తాళం చెవి ఎక్కడ దాచావు?"

"ఆప్రక్కనే ఉన్న టేబిల్ మీద ఉంచాను"

"దొంగతనం ఎప్పుడు జరిగింది?"

"అది నాకు తెలియదు. స్నేహితులకు విందు చేశాను. నేను కొన్ని నెక్లేస్ చూపిద్దామని మేడమీద నెక్లేస్ కోసం చూచాను. కాని కనిపించలేదు. తాళంచెవులక్కడే ఉన్నాయి"

బరువుగా నిట్టూర్చాడు రఘు.

"నీ బంట్రోతు మీద నీ కనుమానమా?"

"వాడివాళ జ్వరంగా ఉందని రానేలేదు."

"మేడమీదకు ఎవరెవరెళ్ళారో తెలుసా?"

"బీరువా ప్రక్కనే నా పుస్తకాల బీరువా ఉంది. ఆ పుస్తకాలు చూడటానికి స్నేహితులంతా మేడ ఎక్కారు. చూచారు. ఎవరి మీదని అనుమానపడటం? కాని నాకు వాళ్ళెవరి మీదా అనుమానం లేదు."

"అయితే పద. మీ స్నేహితులంతా అక్కడే ఉన్నారుగా?"

"టీ పార్టీ అవుతుండగా పరుగెత్తుకొచ్చా. అక్కడే ఉన్నారందరూ."

రఘు ఇంటి ముందు రఘు, రామనాథంవచ్చి వాలారు. రామనాథం యేమీ కంగారు పడకుండా ప్రశాంతంగా లోపలికి వచ్చి గదంతా కలయ జూశాడు. అంతా అతనెరిగిన వాళ్ళే.

"మనవాళ్ళంతా ఇక్కడే ఉన్నారా" అన్నాడు రామనాథం నవ్వుతూ. అందరూ పైకి నవ్వారు. కాని రామనాథం ఊరికేరాడనీ ఏదో ముఖ్యమైన పనిమీదనే వచ్చాడనీ అందరికీ తెలుసు.

"ఏమోయ్ రామనాథం! హఠాత్తుగా దిగావ్?" అన్నాడు గోపాలం.

"ఊరకరారు మహానుభావులు" అన్నదిలీల.

"రఘూ! ఏమిటి ఉన్నట్టుండి మాయమై పోయి ఇన్స్పెక్టరును తీసుకువచ్చావు" అన్నాడు హరిశ్చంద్ర. రఘు మౌనంగా

ఉన్నాడు. రామనాథం కూర్చున్నాడు.

"ఇక్కడొక వస్తువు దొంగిలించబడింది. ఆ వస్తువు మన రఘుదే. అందుకోసమే నేనిక్కడకు వచ్చాను. ఇటువంటి దొంగల్ని నేను అత్యమందిని పట్టుకున్నాను. ఈ దొంగనుకూడా చిటికలో పట్టేస్తాను. దాని కెంతో కాలం పట్టదు. ఒక విధంగా ఆ వస్తువు దొంగిలించిన దొంగను పట్టేసినట్లే. ఇక వాడి చెవులు పిండి వాడి పరువు వీధిపాలు చేయటమే తరువాయి" అన్నాడు అధికార స్వరంతో రామనాథం.

"మీ సంగతి మాకు తెలియదటండీ! అయినా రఘూ అంత అజాగ్రత్తగా ఉంటే ఎలాగోయ్?" అన్నది కమల.

"అవునోయ్! నెక్ లేస్ జాగ్రత్తగా పెట్టుకోకపోతే ఎలాగు? బోలెడంత ఖరీదు చేసే వస్తువు" అన్నాడు హరిశ్చంద్ర.

రామనాథం ముఖంలో ఆనందం తాండవించింది. ఆశా రేఖలు నాట్యంచేశాయి. రఘు వైపు విజయ సూచకంగా చూసి ఒక్క చిరునవ్వు నవ్వాడు. ఒక్క క్షణం ఏదో యోచిస్తున్న వాడిలా మళ్లీ నటించి "దొరికాడు దొంగ" అని కేకేశాడు. అంతా విస్తుపోయి చూస్తున్నారు.

"ఇప్పుడంతా అర్థమయింది. వాడే! ముమ్మాటికీ వాడే. సత్య సంధుడికి మళ్లీ కనిపిస్తే మాత్రం దొంగతనం దాగుతుందా? కాని పాపం! అతను నలుగురిలో తలెత్తుకుని తిరిగే వాడు. అతన్ని బాధించి దొంగగా చాటడం నాకుకూడా యిష్టంలేదు. అయినా తప్పదు. అది నా విధి. కాని అతన్ని రక్షించటానికి అవకాశం ఉంది. మర్యాదగా నాలుగు గంటల లోగా ఆ నగను తను ఎక్కడనుండి తీశాడో అక్కడ ఉంచితే నేనతన్ని వదిలేస్తాను. లేకపోతే తడాఖా చూపిస్తాను. నాలుగు గంటలు టైమిచ్చాను" అన్నాడు రామనాథం. అంతా ఎవర్ని దొంగగా కట్టాడో అని భయపడ్డారు. కంగారులో పరాకుగా జేబులో నెకలేస్ వేసుకున్నా మేమోనని తడిమి చూసుకోవాలనుకున్నారు. కాని రామనాథం ఎదురుగా ఉండటంవలన అంతపని చేయలేదు.

"దొంగ ఇక్కడే ఉన్నట్టుగా మాట్లాడుతున్నారేం?" అన్నది వాసంతి.

"ఇక్కడున్నా, యెక్కడున్నా మీరు నా మిత్రులు కనుక నా నిశ్చయాన్ని వెలిబుచ్చాను. అంతే" అని రామనాథం బయటకు పోయాడు. రఘు అతన్ని వెంబడించాడు.

"మరేం ఫరవాలేదు. నాలుగు గంటల్లో నెక్ లేస్ వచ్చేస్తుంది. కాని నువ్వు మేడమీదికి అందర్నీ వెళ్ళనీ. బీరువా తీసి ఉంచు. ఒక్క గంటసేపు నువ్వు ఇంట్లో ఉండకు. నీ నెక్ లేస్ వచ్చేస్తుంది" అని రామనాథం వెళ్ళిపోయాడు.

ఈ గొడవ జరిగిన అయిదు గంటలకు రఘు ఆనందంతో విప్పారిన ముఖంతో రామనాథం ఇంటికి వచ్చాడు.

"నెక్ లేస్ దొరికిందోయ్. కాని ఆశ్చర్యం, నువ్వన్నట్లుగా ఎక్కడ ఉండేదో అక్కడేవుంది. కాని రామనాథం! దొంగ ఎవరు? ఎలా కనుక్కోగలిగావు? ఆ విషయం మాత్రం నాకు అంతు పట్టటం లేదు."

"హరిశ్చంద్రే ఆ పని చేసింది."

రఘు తెల్లబోయాడు.

"ఎలాగ?" అనడిగాడు.

"నేను వస్తువు పోయిందనే మీ స్నేహితులతో అన్నాను కాని నెక్ లేస్ పోయిందనలేదుగా-కాని హరిశ్చంద్ర ఏమన్నాడో జ్ఞాపకముందా? నెక్ లేస్ జాగ్రత్తగా ఉంచుకోవద్దూ అన్నాడు. నెక్ లేస్ దొంగిలింపబడిందని అతని కెలాగ తెలుసు? దొంగతనం చేశాడన్న మాట. అతన్ని బెదరించి నీ నెక్ లేస్ కాస్తా రప్పించేశాను" రామనాథం ఊహకు రఘు దిగ్భ్రమ చెందాడు.

"మరయితే అతన్ని పోలీసులకు అప్పజెప్ప కూడదూ?" అనడిగాడు రఘు.

"ఎందుకు? అనవసరం. అక్కడ మీ హరిశ్చంద్రుడు తాను నిజంగా సత్య హరిశ్చంద్రుడినేనని ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ గోలంతా ఎందుకు. మన నెక్ లేస్ దొరికింది. అంతే చాలు. కాని రఘు! నువ్వు నీ నెక్ లేస్ పోయినట్లు స్నేహితులతో మొదట్లోనే చెప్పక పోవటం ఎంత లాభ దాయకమయిందో చూశావా?"

రఘు రామనాథాన్ని అభినందించి ఇంటి ముఖం పట్టాడు.